శ్రీరస్తు

# శ్రీ లలితా పంచరత్నమ్

(శ్రీ శంకరాచార్య విరచితం)

శుభమస్తు

- భావార్థముతో -



అవిఘ్నమస్తు



సేకరణ: కిరణ్ టైప్ ఇనిస్టిట్యూట్, 41-1/8-13A,
గౌతమీనగర్, 3వ లైను, కృష్ణలంక, విజయవాడ-520 013.
https://madhirafamily.wordpress.com/



శ్రీ శంకరాచార్య విరచిత

# శ్రీ లలితా పంచరత్నమ్- భావార్థముతో -

01. ప్రాతః స్మరామి లలితావదనార విందం
బింబాధరం పృథుల మౌక్తిక శోభినాసమ్।
ఆకర్ణ దీర్ఘ నయనం మణికుండ లాఢ్యం
మందస్మితం మృదుమదోజ్జ్వల ఫాలదేశమ్॥

దొండ పండు వంటి క్రింది పెదవి, పెద్ద ముత్యముతో శోభించుచున్న ముక్కు, చెవులవరకు వ్యాపించిన కన్నులు, మణి కుండలములు, చిరునవ్వు, కస్తూరీతిలకముతో ప్రకాశించు నుదురు కలిగిన లలితాదేవి ముఖారవిందమును ప్రాతః కాలమునందు స్మరించుచున్నాను.

నేను ప్రాతః కాలమున లలితాదేవియొక్క ముఖపద్మమును ధ్యానింతును. దొండపండువంటి క్రింది పెదవితో, పెద్ద ముత్తెము గల బులాకిచే విలసిల్లు నాసికతో, చెవుల వరకు పొడవైన కన్నులతో, మణిమయ కుండలములతో, మందహాసముతో, కస్తూరిచే నొప్పుచున్న నెన్నుదిటితో శోభించు శ్రీ మల్లలితా ముఖపద్మమును ప్రాతః కాలమున తప్పక తలచు చుందును తల్లీ.

దొండపండు వర్ణంతో శోభించే క్రింది పెదవితో తెల్లటి ముత్యం కలిగిన బులాఖీని నాసికపై ధరించి, చెవులవరకు విస్తరించిన కన్నులతో, మణులతో కూడిన కర్ణకుండలములతో, చల్లని చిరునవ్వుతో, కస్తూరిని ధరించి శోభిల్లుచున్న విశాలమైన ఫాలభాగంతో విలసిల్లే శ్రీ లలితాదేవి ముఖ పద్మాన్ని ప్రాతఃకాలంలో స్మరిస్తున్నాను.

02. ప్రాతర్భజామి లలితా భుజకల్పవల్లీం
రత్నాంగుళీయ లసదంగుళి పల్లవాఢ్యామ్।
మాణిక్య హేమ వలయాంగద శోభమానాం
పుండ్రేక్షు చాప కుసుమేషు సృణీర్దధానామ్॥

ఎఱ్ఱని రత్నములు కూర్చిన ఉంగరములు ధరించిన వ్రేళ్లు అను చిగురుటాకులు కలదీ, మాణిక్యములు పొదిగిన కంకణములతో శోభించున్నదీ, చెరుకువిల్లు - పుష్పబాణము - అంకుశము ధరించినదీ అగు లలితాదేవి భుజములను కల్పలతను ప్రాతః కాలమునందు సేవించుచున్నాను.

లలితా పరమేశ్వరి యొక్క బాహువు(లు) కల్పలత వంటిది(వి). ఎఱ్ఱని మణులు చెక్కిన ఉంగరములతో నొప్పుచున్న వ్రేళ్ళు ఆ కల్పలతకు చిగురాకువలె నున్నవి. మణులు పొదిగిన కంకణములతో దండకడియములతో నొప్పుచు, చెఱకు వింటితోను - పూవుటమ్ములతోను - పాశాంకుశములతోను - ప్రకాశించుచున్న ఆ లలితా భుజకల్పవల్లిని నేను ఉషఃకాలమున సేవించు కొనుచుందును తల్లీ.

బాహువులు కల్పలతగా, అనగా తీగగా, ఎరుపురంగు మణులతో కూడిన ఉంగరములు ఆ తీగకు చివురుటాకులుగా, హస్తములకు మాణిక్య కంకణములతో, చేతిలో చెరకు వింటితో పూల అమ్ముల పొదితో, పాశము, అంకుశముతో ప్రకాశిస్తున్న శ్రీ లలితాదేవి భుజములకు ప్రాతః కాలంలో నమస్కరిస్తున్నాను.

03. ప్రాతర్నమామి లలితా చరణార వందం
భక్తేష్ట దాన నిరతం భవ సింధు పోతమ్।
పద్మాసనాది సురనాయక పూజనీయం
పద్మాంకుశ ధ్వజ సుదర్శన లాంఛనాఢ్యమ్॥

భక్తుల కోరికలను ఎల్లప్పుడు తీర్చునదీ, సంసార సముద్రమును దాటించు తెప్పయైనదీ, బ్రహ్మ మొదలగు దేవనాయకులచే పూజింపబడునదీ, పద్మము - అంకుశము - పతాకము - చక్రము అను చిహ్నములతో ప్రకాశించుచున్నదీ అగు లలితాదేవి పాదపద్మమును ప్రాతః కాలమునందు నమస్కరించుచున్నాను.

భక్తుల కోర్కెలను తీర్చుటయందు నిత్యము ఆసక్తిని ప్రదర్శించుచు, సంసార సాగరమును దాటించుటకు తెప్పయై ఒప్పుచు, బ్రహ్మేంద్రాదుల పూజల నందు కొనుచు, పద్మము - అంకుశము - పతాకము - చక్రము వంటి రేఖాత్మక చిత్రములతో నిండి - ప్రకాశించుచున్న శ్రీ లలితాంబికా చరణపద్మములను నేను ఉదయముననే మ్రొక్కి కనుల కద్దుకొనుచున్నాను తల్లీ!

నిరంతరము నమ్మి భజించు భక్తుల కోరికలు తీర్చునదియు, సంసార సాగరమును దాటించుటకు నావయైనదియు, బ్రహ్మాది దేవతలచేత పూజింపబడునదియు, పద్మము, అంకుశము, ధ్వజము వంటివి హస్తములందు ధరించి ప్రకాశించే శ్రీ లలితాదేవి యొక్క పాదపద్మములకు ప్రాతః కాలంలో నమస్కరిస్తున్నాను.

04. ప్రాతః స్తువే(తే) పరశివాం లలితాం భవానీం
త్రయ్యంతవేద్య విభవాం కరుణా నవద్యామ్।
విశ్వస్య సృష్టి విలయ స్థితి హేతు భూతాం
విశ్వేశ్వరీం నిగమ వాఙ్మనసాతి దూరామ్॥

వేదాంతములచే తెలియబడు వైభవము కలదీ, కరుణచే నిర్మలమైనదీ, ప్రపంచము యొక్క సృష్టి - స్థితి - లయ లకు కారణమైనదీ, విద్యలకు అధికారిణియైనదీ, వేద వచనములకు - మనస్సులకు అందనిదీ, పరమేశ్వరియగు లలితా భవానీ దేవిని ప్రాతః కాలము నందు స్తుతించు చున్నాను.

ఉపనిషత్తులచే తెలియదగిన విభవముగల, దయచే నిర్మలమైన హృదయముగల ప్రపంచముయొక్క సృష్టి - స్థితి - లయములకు, ఆది కారణమైన వేదవాక్కులకు, మనసులకు అందని విశ్వేశ్వరియు, పరమేశ్వరియు నగు లలితాదేవిని ప్రాతః కాలమున స్తుతించుచున్నాను.

వేదాంతాంతర్గతములైన ఉపనిషత్తులచే స్తుతించబడునదియు, ప్రపంచము యొక్క సృష్టి స్థితి, లయములకు కారణభూతురాలును, వేదములు, మనస్సు కూడా పూర్తిగా వర్ణించలేని శ్రీ లలితాదేవిని ప్రాతః కాలమున ప్రార్థిస్తున్నాను.

05. ప్రాతర్వదామి లలితే తవ పుణ్యనామ
కామేశ్వరీతి కమలేతి మహేశ్వరీతి।
శ్రీశాంభవీతి జగతాం జననీ పరేతి
వాగ్దేవతేతి వచసా త్రిపురేశ్వరీతి॥

ఓ లలితాదేవీ! కామేశ్వరీ - కమల - మహేశ్వరీ - శ్రీశాంభవి - జగజ్జనని - వాగ్దేవత - త్రిపురేశ్వరి - అను నీ నామములను ప్రాతః కాలము నందు జపించు చున్నాను.

అమ్మా! లలితాదేవి! కామేశ్వరి, కమల, మహేశ్వరి, శ్రీశాంభవి, జగజ్జనని, వాగ్దేవత, త్రిపురేశ్వరి అను నీ పుణ్యనామములను ప్రాతః కాలమున ఉచ్ఛరించు చున్నాను తల్లీ.

కామేశ్వరి, కమల, మహేశ్వరి, శాంభవి, జగదీశ్వరి, త్రిపురేశ్వరి అనే పుణ్య నామాలతో శోభిల్లే శ్రీ లలితాదేవి నామాలను ప్రాతః కాలంలో స్మరిస్తున్నాను.

06. యః శ్లోకపంచకమిదం లలితాంబికాయాః
సౌభాగ్యదం సులలితం పఠతి ప్రభాతే।
తస్మై దదాతి లలితా ఝటితి ప్రసన్నా
విద్యాం శ్రియం విమలసౌఖ్యమనంతకీర్తిమ్॥

సౌభాగ్యము నిచ్చునదీ, సులభమైనదీ అగు లలితా పంచ రత్నమును ప్రాతః కాలము నందు ఎవడు పఠించునో వానికి లలితాదేవి శీఘ్రముగా ప్రసన్ను రాలై విద్యను, సంపదను, సుఖమును, అంతులేని కీర్తిని ప్రసాదించును.

ఈ లలితా పంచకమను స్తోత్రము చేయుటవలన సౌభాగ్యమును కలిగించును. ఇది లలితమైనది. ప్రాతఃకాలమున నిదురలేచి ఈ స్తోత్రమును పఠించు వాని యెడల లలితాంబిక శీఘ్రముగా ప్రసన్నయై విద్యను, సిరిని, సుఖమును, అనంత కీర్తిని ప్రసాదించును.

ఈ లలితా పంచ రత్నాలను ప్రాతః కాలంలో పఠించడం వలన సౌభాగ్యము కలిగి అటువంటి వారి యెడల శ్రీ లలితాంబిక ప్రసన్నురాలై సకల విద్యలను, ఐశ్వర్యాన్ని, సుఖసంతోషాలను, చిర యశస్సును ప్రసాదించి ఆశీర్వదిస్తుంది.

// ఇతి శ్రీ శంకరాచార్య విరచిత శ్రీ లలితా పంచరత్నమ్ సంపూర్ణమ్ //

- - - = - - -

# గాయత్రీ మహా మంత్రము

విశ్వామిత్రుడు - ఋషి // సవిత - దేవత // గాయత్రి - ఛందస్సు

ఓం భూర్భువస్సువః తత్స వితుర్వరేణ్యమ్।
భర్గో దేవస్య ధీమహి ధియో యోనః ప్రచోదయాత్॥

ఓ సచ్చిదానందా! అనంత స్వరూపా! ఓ నిత్య శుద్ధ బుద్ధ ముక్త స్వభావా! ఓ నిరాకారా! సర్వశక్తిమంతుడవగు న్యాయకారీ! ఓ కరుణామృత వారధీ! నీ దివ్యమూ వరేణ్యమూ నగు విజ్ఞాన రూపమును మేము నిత్యము ఉపాసింతుము. మాకు ధారణ శక్తిగల బుద్ధి నిత్తువు గాక! మేమూ బుద్ధి సహాయమున బ్రహ్మచర్యాది సద్వ్రతముల నాచరింతుము గాక! విద్యా జ్ఞానాదులనూ, పరమ సుఖములనూ పొందుదుము గాక!

- - - = - - -

కిరణ్ టైప్ ఇన్స్టిట్యూట్





Kiron Type Institute

కిరణ్ టైప్ ఇన్‌స్టిట్యూట్

